క్లుప్తంగా

చెర్లోపల్లె పాఠశాలలో స్వచ్ఛభారత్ పనులు


చెట్లకు పాదులు తీస్తున్న వలంటీర్లు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం అరగొండ నర్సింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే స్వచ్ఛ భారత్ పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లచే పారిశుధ్య పనులు చేశారు. మొక్కల చుట్టూ గడ్డిని తొలగించి పాదులు ఏర్పాటు చేసి నీరుపోశారు. పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, సర్పంచ్ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

చిత్తూరు కార్పొరేషన్: సిద్ధ సమాధి యోగా శిక్షణ తరగతులను ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని యోగాచార్యులు నరేంద్రకుమార్, బ్రహ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విజయం డిగ్రీ కళాశాలలో 14 ఏళ్లు పైబడిన వారికి 14 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగలవారు 8247609140ను సంప్రదించాలని వివరించారు.

మోడల్ పోలింగ్ కేంద్రంగా పూతలపట్టు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. డీటీతో మాట్లాడుతూ ఈ పోలింగ్ కేంద్రంలో సకల సదుపాయాలు ఉన్నాయని, మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో అత్యవసర సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా నెలాఖరులోపు అన్ని తప్పొప్పులను సరిచేయాలని సూచించారు. వీరి వెంట డీటీ(ఎన్నికలు) మహేశ్వరి, బీఎల్వోలు ఉన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై గొడవ

చిత్తూరు రూరల్: నగరంలోని గంగసారంలో శనివారం రాత్రి శ్మశానస్థలం ఆక్రమణపై గొడవ చోటుచేసుకుంది. చిన్నయ్య అనే వ్యక్తి మృతి చెందగా మృతదేహాన్ని స్థానిక శ్మశాన వాటికలో ఖననం చేశారు. అయితే ఓ వ్యక్తి ఈ స్థలం తనదేనని గొడవకు దిగాడు. మృతదేహాన్ని పూడ్చేందుకు అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని ఆ భూమి శ్మశాన భూమి అని తేల్చారు.

12న కోదండరామాలయ కుంభాభిషేకం


గ్రామంలో నిర్మించిన కోదండరామాలయం

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలో నిర్మిస్తున్న కోదండరామస్వామి దేవాలయ కుంభాభిషేకం ఈ నెల 12న నిర్వహించనున్నట్లు అమరరాజ సంస్థ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రానాయుడు తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ తాను విరాళాలు సేకరించి, కొంత సొంత నగదు వెచ్చించి స్వగ్రామం పేటమిట్టలో కోదండరామస్వామి దేవాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు కుంభాభిషేక మహోత్సవాలు ఉంటాయని చెప్పారు. 15న సీతాలక్ష్మణ సమేత రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వివరించారు.

శివలింగంపై సూర్య కిరణాలు



రొంపిచెర్ల: మండల కేంద్రం సమీపంలోని కట్టకింద శివలింగంపై శనివారం ఉదయం సూర్య కిరణాలు ప్రసరించాయి. మహా శివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో శివలింగంపై సూర్య కిరణాలు ప్రసరిస్తాయని ఆలయ పూజారులు తెలిపారు. ఆ సమయంలో చూస్తే భక్తులు కోర్కెలు నెరవేరుతాయని పేర్కొన్నారు. భక్తులు సూర్యకిరణాలను చూసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు ముని రాజశర్మ శాస్త్రోక్తంగా పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

భారత్ గ్యాస్ అదనపు దోపిడీ

- గ్యాస్ సిలిండర్‌పై అదనంగా రూ.30 నుంచి 70 వసూలు
- నెలకు సగటున రూ.1.20 లక్షల అక్రమ సంపాదన
- బెంబేలెత్తిపోతున్న వినియోగదారులు
- టోల్ ఫ్రీ నంబర్ -1906కు ఫిర్యాదు చేయాలంటున్న అధికారులు
- డోంట్ కేర్ అంటున్న నిర్వాహకులు


వీఎస్.అగ్రహారంలో సిలిండర్లను తరలిస్తున్న భారత్ గ్యాస్ ఏజెన్సీ వాహనం

ఐరాల: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్యాస్ సిలిండర్ పొందడానికి వినియోగదారులు కంపెనీ నిర్దేశించిన ధర చెల్లించినప్పుడు అందులో గ్యాస్ ఏజెన్సీకి కొంత కమీషన్ రూపంలో అందుతుంది. ఈ కమీషన్ పొందిన ఏజెన్సీ వారు ఐదు కిలోమీటర్ల లోపు ఉచితంగా సిలిండర్ అందజేయాల్సి ఉంటుంది. వినియోగదారుల నుంచి ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయరాదన్న నిబంధనలు ఉన్నాయి. కానీ గ్యాస్ వినియోగదారుడు ఇప్పటివరకు ఉచిత డెలివరీ తీసుకున్న దాఖలాలు లేవు. సిలిండర్ బుక్ చేసుకుంటే, డెలివరీ సమయంలో అదనంగా రూ.30 నుంచి 70 వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. మరి కొందరు ఏజెన్సీ వద్దకు వెళ్లి సిలిండర్ తీసుకున్నా అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదేమని అడిగితే ఇక్కడ ఇంతే.. ఇష్టం ఉంటే సిలిండర్ తీసుకోండి.. లేకపోతే పొండి అంటూ సిబ్బంది చెబుతున్నారని చెప్పారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.937కు విక్రయించాలి. ఏజెన్సీ నిర్వాహకులు డోర్ డెలివరీ బాయ్స్ ద్వారా రూ.970 నుంచి, రూ.1000 చొప్పున వసూలు చేయిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇలా నెలకు రూ.1.2 లక్షలకు పైగా అక్రమంగా ఆర్జిస్తున్నట్లు అంచనా. గ్యాస్ ఏజెన్సీ, డెలివరీ బాయ్స్ అదనపు దందా వ్యవహారం బహిరంగ రహస్యం. అయితే ఈ అదనపు బాదుడుపై మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా డోంట్ కేర్ అనే రీతిలో నిర్వాహకులు వ్యవహరిస్తున్నారంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ.లక్షపైనే

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. వినియోగదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఏజెన్సీ నిర్వహణ కోసం ప్రతి నెలా కమీషన్ రూపంలో రూ.5లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. ఇది చాలదన్నట్లు అదనపు దోపిడీకి తెరతీస్తున్నారు. మండలంలో మొత్తం 3,000 భారత్ గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ప్రతి నెలా సగటున 1,820 గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఒక్కో గ్యాస్ సిలిండర్‌కు సగటున అదనంగా రూ.30 నుంచి రూ.70 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనపు వసూళ్ల దందాను అడ్డుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

నిబంధనలు ఇలా..

నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఆయా కంపెనీలు నిర్ణయించిన ధరకు సిలిండర్‌ను డెలివరీ బాయ్స్ ద్వారా వినియోగదారుడి ఇంటికి చేర్చాలి. ఇందుకోసం అదనంగా రూపాయి కూడా వినియోగదారుడి నుంచి తీసుకోకూడదు. గ్యాస్ సిలిండర్లను తరలించే వాహనం వెంట విధిగా ఎలక్ట్రానిక్ కాటా ఉండాలి. డోర్ డెలివరీ చేసే సమయంలో విధిగా తూకం వేసి, వినియోగదారుడికి సిలిండర్ ఇవ్వాలి. గ్యాస్ ఆఫీస్ నుంచి 5 కి.మీ.వరకూ ఉచితంగానే సిలిండర్‌ను సరఫరా చేయాలి. 5 నుంచి 15 కి.మీ వరకూ రూ.20, ఆపైన రూ.30కి మించి రవాణా చార్జీలు వసూలు చేయాలన్నది నిబంధన. బిల్లులోనే ఆ మేరకు వివరాలు స్పష్టంగా ఉంటాయి. వీటన్నింటినీ ఏజెన్సీ నిర్వాహకులు తుంగలో తొక్కుతున్నారు. బిల్లుతో సంబంధం లేకుండా డెలివరీ బాయ్స్ ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. మండల కేంద్రంలో ఏజెన్సీ కార్యాలయం 5 కి.మీ.లోపే ఉంటోంది. అంటే ఉచితంగా సిలిండర్లు సరఫరా చేయాలి. కానీ ఏజెన్సీ నిర్వాహకులు దూరంతో సంబంధం లేకుండా సిలిండర్‌పై రూ.70 వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు బాధితులు వాపోతున్నారు.


భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం

ముక్కు పిండి వసూలు చేస్తున్నారు

కేంద్ర ప్రభుత్వం ఒక పక్క గ్యాస్ ధర పెంచి ఆర్థిక భారం మోపుతుంటే, ఏజెన్సీ నిర్వాహకులు డెలివరీ పేరుతో ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. సిలిండర్‌కు రూ.40 అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఇంటికి కూడా తీసుకొచ్చి ఇవ్వడం లేదు. గ్యాస్ ఏజెన్సీ ఆగడాలు ఆపకపోతే సామాన్యులపై మరింత భారం పడే అవకాశం ఉంది.

– రవి, వీఎస్ అగ్రహారం, ఐరాల

విచారించి చర్యలు తీసుకుంటాం

భారత్ గ్యాస్ ఏజెన్సీ అక్రమ వసూళ్లపై విచారణలో అక్రమాలు నిజమని తేలితే ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు రవాణా చార్జీలు వసూలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి, అదనంగా డబ్బు వసూలు చేసే ఏజెన్సీని ఉపేక్షించేది లేదు. వినియోగదారులు డెలివరీ బాయ్స్‌కు రూపాయి కూడా అదనంగా ఇవాల్సిన అవసరం లేదు. సరఫరా చేసే వారు అదనంగా డబ్బు కావాలని డిమాండ్ చేస్తే, టోల్‌ఫ్రీ నంబరు 1906కు ఫిర్యాదు చేయాలి.

– శ్రీనివాసులు, తహసీల్దార్, ఐరాల

సంక్షేమం అందించిన ఘనత జగనన్నదే



తిమ్మోజుపల్లెలో కరపత్రాలను అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్, గుడిపాల: ఇంటింటా ప్రచారంలో విజయానందరెడ్డి

బంగారుపాళెం: రాష్ట్రం సంక్షేమ బాట నడవాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె, దళితవాడ, కురప్పల్లె గ్రామాల్లో శనివారం నాయకులతో కలసి పర్యటించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిన విషయం జనం గుర్తుపెట్టుకున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఈ సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగుతాయని వివరించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. జగనన్న ఆదేశాల మేరకు తనను పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా నియమించారన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు ప్రజలు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. ప్రజా సంక్షేమాన్ని కోరే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్ భగత్‌రెడ్డి, ఎంపీటీసీ హేమచంద్ర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్లప్ప, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సాయిరెడ్డి, మైనారిటీ సెల్ కార్యదర్శి సుహేల్, సర్పంచులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం

గుడిపాల: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం జగనన్నేనని వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని కుప్పిగానిపల్లె, క్రిష్ణజమ్మాపురం పంచాయతీలో శనివారస్థానిక సర్పంచ్ మధుసూదన్‌రాయల్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని గుర్తుచేశారు. ప్రతి కుటుంబానికి ఏదో విధంగా మేలు చేసినట్లు వివరించారు. ఏ గ్రామానికి వెళ్లినా ఆడపడుచులు, వృద్ధులు, దివ్యాంగులు జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నట్లు వివరించారు. చంద్రబాబునాయుడు మాయమాటలను ఎవరూ నమ్మడం లేదని చెప్పారు. 2014లో రుణమాఫీ పేరిట నట్టేట ముంచారని గుర్తుచేశారు. అమ్మ ఒడి, దశలవారీగా పింఛన్‌పెంపు, వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు, విద్యాదీవెన, వసతి దీవెనలతోపాటు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, వడ్డీలేని రుణాలు వంటి అనేక పథకాలను వైఎస్సార్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధన్, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, మధుసూదన్ రెడ్డి, రజినీకాంత్, మధురెడ్డి, శిలంబరసన్, మనోహర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాకేష్, శేఖర్, రవీంద్రారెడ్డి, వెంకటరమణ, గుండుసాయి, చెంగల్రాయులు, గోపాల్, క్రిష్ణమూర్తి, జయపాల్, వెంకటేష్, వడివేలు, శంకర్, సుమన్, మైఖేల్‌రాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

బంగారుపాళెం: రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న హమాలీ(కూలీ)ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం సాయంత్రం మండల హమాలీ కార్మిక సంఘ సమావేశం అధ్యక్షుడు దేవరాజులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న హమాలీ హెడ్ లోడ్ చట్టాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని కార్మిక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ సమస్యలపై రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యూనియన్ నాయకులు రామమూర్తి, ప్రభాకర్, రఘు, లోకేష్, రవి, కృష్ణయ్య, మురళి అభిలాష్, ప్రభు, హనుమంతు, పిచ్చాండి పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు


గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రమహేష్


తవణంపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

గుడిపాల: వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. రామభద్రాపురంలో శనివారం 104 ఆధ్వర్యంలో వైద్యసేవలను ఆమె అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి గ్రామంలో వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. మంచం మీద ఉన్న రోగుల ఇంటి వద్దకే వెళ్లి సేవలందించారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనిత, అనురాధ, చంద్ర, శివగామి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కారకాంపల్లె, చారాల గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు రెండు గ్రామాల్లో 127 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్యబృందం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటికే వైద్య సేవలు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటికే వైద్య సేవలు అందిస్తున్నామని, ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. నడవలేని పరిస్థితులు ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇంటి వద్ద నీటి నిల్వ ఉన్నచోట దోమలు వృద్ధి చెందడంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పేరయ్యగారిపల్లెలో వృద్ధునికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీఆర్ రెడ్డి జీవితం విద్యార్థులకు ఆదర్శం


వక్తృత్వలో పోటీల్లో పాల్గొని ప్రసంగిస్తున్న విద్యార్థిని

చిత్తూరు రూరల్: బహుముఖ ప్రజ్ఞాశాలి సీఆర్ రెడ్డి జీవితం విద్యార్థులకు ఆదర్శమని సీఆర్ రెడ్డి స్మారక ట్రస్ట్ సభ్యులు ఎంపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సీఆర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం చిత్తూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 300 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సీఆర్ రెడ్డి చిత్తూరు జిల్లావాసి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. విద్య, రాజకీయ, సాహిత్య రంగాల్లో సీఆర్ రెడ్డి ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. ఆ మహనీయుని స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. పోటీల్లో విజేతలకు ఈ నెల 24న బహుమతుల్ని ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. న్యాయనిర్ణేతలు సుధాకర్, అరుణశివప్రసాద్, భాస్కర్ రెడ్డి, మునిస్వామి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే బలిజలకు న్యాయం


మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

గుడిపాల: బలిజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం న్యాయం చేసిందని మండల బలిజ సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బలిజసంఘం సమావేశానికి నాయకులు మధుసూదన్‌రాయల్, జనార్దన్, మోహన్, కృష్ణమూర్తి, నంద, సుమన్, మార్కండేయులు, నంది మాధవ, కోదండ హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ రాయలసీమలో బలిజలకు ఎమ్మెల్యే సీటు ఒక్కటి కూడా ఇవ్వలేదని టీడీపీ వారు నానాయాగీ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్నారన్నారు. కొంతమంది కాపులు తెలుగుదేశం నాయకులతో జతకలిసి అన్యాయం చేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని కాపులకే అత్యధికంగా ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినట్లు గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు కాపులను బీసీల్లో చేరుస్తామని మాటిచ్చి మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలు, ఎస్సీలకు సమానంగా కాపులకు కూడా కాపునేస్తం పేరుతో రూ.15వేలు అందించినట్లు గుర్తుచేశారు.

సౌకర్యాలు కల్పించండి

గంగవరం: పోలింగ్‌కేంద్రాల్లో లైట్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఎన్నికల సమయానికి పూర్తయ్యేలా చూడాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో మొత్తం 51 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ ఒక్కరోజే గంగ్రాజుపల్లె, పసుపత్తూరు, గుండుగల్లు, తాళ్ళపల్లె, కల్లుపల్లె, కీలపల్లె, జీడిమాకులపల్లె, మామడుగు, మేలుమాయి, కలగటూరు.. ఇలా మొత్తం 31 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకేశ్వరరావు, డీటీ సహానా, సర్వేయర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో కమిషనర్ తనిఖీలు


డంపింగ్ యార్డును తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును కమిషనర్ అరుణ శనివారం తనిఖీ చేశారు. డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. డంపింగ్ యార్డులో ముందుకొచ్చిన వ్యర్థాలను సత్వరం వెనక్కి తరలించాలని చెప్పారు. వ్యర్థాలన్నీ ఎందుకిలా ముందుకు వచ్చాయని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వ్యర్థాలను క్రమపద్ధతిలో నిర్వహించాలని ఆదేశించారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల ప్రాసెసింగ్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. విండ్రో కంపోస్ట్, వర్మీ కంపోస్ట్ యూనిట్లను పూర్తి స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను చిన్న ముక్కలుగా కత్తిరించే పల్వరైజేషన్ యంత్రం, ఇతర యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు ఖాళీ స్థలంలో సేంద్రియ వ్యవసాయం జరుగుతున్న తీరును పరిశీలించి, కూరగాయల సాగును విస్తరించాలన్నారు. వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.

వేగంగా గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

నగరపాలక పరిధిలో ఇంటి స్థలాలు, గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ జె అరుణ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. నగరపాలక పరిధిలో వార్డు సచివాలయాల్లో జరుగుతున్న పేదలందరికీ ఇల్లు.. గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కమిషనర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంబయ్య కండ్రిగ వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. వార్డు కార్యదర్శులకు మార్గనిర్దేశం చేసి, లబ్ధిదారులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎక్కడా పొరబాట్లకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. లేఅవుట్లు, లబ్ధిదారుల వివరాలను సరిచూసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇంటి స్థలాలు, గృహాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి మరో మూడు రోజులే సమయం ఉన్నందున వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియలను సంబంధిత సూపర్‌వైజర్ అధికారులు, హౌసింగ్ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. లబ్ధిదారులను సమన్వయం చేసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. కమిషనర్ వెంట ఆర్వో గోపాలకృష్ణ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం ఉన్నారు.